www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 8 జులై 2023
5
వైఎస్ఆర్



సాంకేతిక శిక్షణ అవసరం

ప్రజాశక్తి- కడప అర్బన్

ఆధునిక సాంకేతిక యుగంలో ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు సాంకేతిక శిక్షణ ఎంతో అవసరమని ఎంఇఒ నారాయణ అన్నారు. శుక్రవారం కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. అధ్యాపకులు శిక్షణ ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులకు సాంకేతికంగా సులభతరమైన బోధన పద్ధతులు, పటిష్టమైన అభ్యసన వంటి అంశాలపై అవగాహన కలుగుతుందని పేర్కొన్నారు. అనంతరం వారు కార్యక్రమ నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. 153 మంది ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు మూడవ బ్యాచ్ (రెండు రోజులు) శిక్షణకు హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి అధికారులు రామాంజనేయ రెడ్డి, సహాయ కో- ఆర్డినేటర్లు రమణ మూర్తి, ఇమామ్ ఖాసీం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. ఎస్ ఎస్. మూర్తి, సాంకేతిక నిపుణులు డాక్టర్ ఎం వెంకట రమణ, సహాయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలడెయిరీలకు మోక్షమెప్పుడో?



సా..గుతున్న కడప రోడ్ల విస్తరణ
అటకెక్కిన స్ట్రోమ్‌డ్రెయిన్ల హామీ
జిజిహెచ్‌లో సూపర్ స్పెషాలిటీ సేవలేవీ
నేటి నుంచి జిల్లాలో సిఎం జగన్ పర్యటన

జిల్లా వ్యవసాయాధారిత ఆర్థికాభివృద్ధికి వెన్నెముక కడప, ప్రొద్దుటూరు పాలడెయిరీలు, చెన్నూరు చక్కెర, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను పునరుద్ధరిస్తామని ప్రతిపక్ష నేత హోదాలో పాదయాత్ర సాక్షిగా ఇచ్చిన హామీ నీరోడుతోంది. ముఖ్యమంత్రి హోదాలో చేసిన శంకుస్థాపనలు సాకారానికి నోచుకోలేదు. పెండింగ్ పనుల పురోగతికి ఇచ్చిన హామీలు అమలుకు ఆమడదూరంలో ఉన్నాయని చెప్పవచ్చు. కడప నగరంలోని నాలుగు ప్రధాన రహదారుల విస్తరణ పనులకు నిధుల కొరత వెంటాడుతోంది. కడప నగరంలో నాలుగు స్ట్రోమ్ వాటర్ డ్రెయిన్లు, ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ భవన నిర్మాణ ఏర్పాటు, జిజిహెచ్ సూపర్‌స్పెషాలిటీ సేవలు అమలుకుకు నోచుకోలేదు. రూ.454 కోట్ల జిజిహెచ్ బోధనాస్పత్రి, సైక్రియాటిక్, కేన్సర్‌బ్లాక్, సూపర్ స్పెషాలిటీ బ్లాక్ పనులు, కొప్పర్తి పైప్‌లైన్ పనులు, హజ్‌హౌస్ పెండింగ్ పనులు అడుగు ముందుకు పడిన దాఖలాల్లేవు. శనివారం నుంచి సోమవారం వరకు జగన్ జిల్లాలోని కడప, పులివెందుల, ఇడుపులపాయ, జమ్మలమడుగు నియోజకవర్గంలో పలు శంకుస్థాపనలకు హాజరవుతున్న నేపథ్యంలో కథనం.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప, ప్రొద్దుటూరు పాల కర్మాగారాలు పునరుద్ధరణకు నోచుకోలేదు. పాల కర్మాగారాన్ని పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీ అమలు కావడం లేదు. చెన్నూరు చక్కెర పరిశ్రమ పునరుద్ధరణకు హామీ అటకెక్కింది. మూడు కమిటీలు సర్వే చేసినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. గత పర్యటన సందర్భంగా చక్కెర పరిశ్రమ ఉద్యోగులకు సంబంధించిన రూ.16 కోట్ల పెండింగ్ బకాయిలు విడుదల చేసి, పునరుద్ధరణ పనుల పట్ల ఉదాసీనతగా వ్యవహరించారు. 2007లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ సర్కారు తలపెట్టిన రూ.72 కోట్లతో కడపలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ పెండింగ్‌లో పడింది. రాంకీ కాంట్రాక్టు సంస్థ టెండరును దక్కించుకుంది. 2015 నాటికి 68 శాతం పనులు పూర్తి చేసింది. ఇరిగేషన్, ఆర్‌అండ్‌బి శాఖల అవాంతరాల నేపథ్యంలో చేతు లెత్తేసింది. టిడిపి సర్కారు 2018లో హైద రాబాద్‌కు చెందిన శ్రీసాయి కన్‌స్ట్రక్షన్ కంపెనీకి 108.41 కోట్లతో భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ కాంట్రాక్టును దక్కించుకున్నప్పటికీ ఎటువంటి స్పందన లేకుండా పోయింది. రూ.305 కోట్లతో కడపలోని అన్నమయ్య సర్కిల్, గోకుల్ లాడ్జి సర్కిల్ రహదారుల విస్తరణ పనులు టెండర్ల దశను దాటడం లేదు. మాసాపేట సర్కిల్, వైజంక్షన్ సర్కిల్ విస్తరణ పనులు సా..గుతున్నాయని చెప్పవచ్చు. రూ.70 కోట్ల విలువైన స్ట్రోమ్ డ్రెయిన్ల ఏర్పాటు హామీ అటకెక్కింది. ప్రతి ఏటా కురుస్తున్న వర్షాల ధాటికి నగరం ముంపునకు గురవుతోంది. కడపలో స్ట్రోమ్‌డ్రెయిన్ కాల్వల ఆక్రమణలను తొల గించి విస్తరణ పనులు చేపట్టడానికి ఇచ్చిన హామీ నిధులు లేక నీరోడుతోంది. రూ.454 కోట్ల విలువ కలిగిన జిజిహెచ్ బోధనాస్పత్రి, కేన్సర్, సైక్రి యాటిక్, సూపర్‌స్పెషాలిటీ హెూదా పనులు సా..గుతూనే ఉన్నాయి. ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. రూ.345 కోట్లతో కూడిన ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ పనులకు ఆర్కిటెక్ట్ దశను దాటలేదు. ఫలితంగా యూనివర్శిటీ నిర్మాణం ఎప్పటికి సాకారమవుతుందో తెలియని దుస్థితి దాపురించింది. రూ.12 కోట్లతో కూడిన హజ్‌హౌస్ పెండింగ్ పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియడం లేదు. నిధుల లేమి కారణంగా సకాలంలో పూర్తి చేయడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రూ.150 కోట్ల విలువ కలిగిన కొప్పర్తి పారిశ్రామికవాడ నీటిపైప్ లైన్ పనులపై అయోమయం నెలకొంది. కొప్పర్తిలో పరిశ్రమల ఏర్పాటుకు నీటి కొరత కారణంగా జంకుతున్నారు. కొప్పర్తి పారిశ్రామికవాడలోని వైఎస్ఆర్ క్లస్టర్లలో ఏర్పాటు చేసిన పరిశ్రమలు ఎప్పటికి కార్యకలాపాలు సాగిస్తాయో తెలియడం లేదు. చెప్పు కోదగిన రీతిలో నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చిన దాఖలా ల్లేవు. కడపలో రెండవ ఆర్టీసీ డిపో, సిటీ బస్సుల సదుపాయాలు అందని ద్రాక్ష చందంగా ఊరిస్తుండడం గమనార్హం. జిల్లావాసే ఆర్టీసీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా మల్లికార్జునరెడ్డి రావడంతో ఆశాభావం వ్యక్తమవుతోంది. 12 కోట్లతో కూడిన బుగ్గవంక ప్రహరీకి ఇరువైపులా రహదారి నిర్మాణ పనులు ఆశించిన రీతిలో సాగలేదు. బ్యూటిఫికేషన్, లైటింగ్ సిస్టమ్ వంటి పనులు ఎప్పుడు ఏర్పడతాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. జిఎన్ఎస్ఎస్ ఫేజ్-1లో భాగమైన సర్వ రాయసాగర్, వామికొండ, రిజర్వాయర్లు ఎప్పటికి సాకార మవుతాయో తెలియడం లేదు. ఇటీవల జిల్లా నీటి పారుదలశాఖ రూ.212 కోట్లతో కూడిన ప్రతిపాదనలు పంపిం చినప్పటికి పాలనాపరమైన అనుమతుల మంజూరు కోసం నిరీక్షించాల్సి వస్తోంది. అన్నమయ్య రిజర్వాయర్ రూ.777 కోట్లతో కూడిన పునరుద్ధరణ ప్రక్రియ సా.. .గుతోంది. టెండర్ల దశను దాటుకుని క్షేత్రస్థాయికి చేరుకున్నప్పటికీ ఆశించినరీతిలో పనులు సాగడం లేదు. దీంతోపాటు పింఛా ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు ఊపందుకోకపోవడం ఆందోళన వ్యక్తమవు తోంది.

సిఎం పర్యటన ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్‌పి పరిశీలన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్/ వేంపల్లె

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి పులివెందుల పర్యటించే ప్రాంతాలలో ఏర్పాట్లను కలెక్టర్ విజయ్‌రామరాజు, ఎస్‌పి అన్బురాజన్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణంలోని ముఖ్యమంత్రి ప్రారంభించబోయే నూతన మున్సిపల్ కార్యాలయ భవనాన్ని, నగరవనాన్ని, గరండాల వంక బోటింగ్, హాకీ స్టేడియం, క్రికెట్ స్టేడియం, తదితర ప్రాంతాలను పరిశీలించి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులు తగిన ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, ప్రత్యేక అధికారి అనిల్ కుమార్ రెడ్డి, ఆర్డిఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, వైస్ ఛైర్మన్ వైఎస్ మనోహర్ రెడ్డి, కమిషనర్ నరసింహారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. **పోలీసులకు దిశ నిర్దేశం చేసిన ఎస్‌పి..** ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి మూడు రోజుల కడప జిల్లా పర్యటన నిమిత్తమై పటిష్ట బందోవస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్‌పి అన్బురాజన్ అన్నారు. శుక్రవారం పులివెందులలోని సిఎస్ఐ మైదానంలో పోలీసులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా పోలీసులు విధులు నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్య మంత్రి పర్యటన సందర్భంగా ఒక ఎఎస్‌పి, ఐదుగురు డిఎస్‌పిలు 20 మంది ఎస్ఐలు, 120మంది ఎఎస్ఐలు, 200 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 500 మంది కానిస్టేబుళ్లు, హోమ్‌గార్డులు పర్యవేక్షిస్తారని చెప్పారు. అనంతరం ఎస్‌పి సిఎం కాన్వాయ్ ట్రయల్ రన్ లో పాల్గొన్నారు. **ఇడుపులపాయలో కట్టుదిట్టం..** ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా మండలంలోని ఇడుపులపాయలో ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేపట్టినట్లు ఎస్‌పి అన్బురాజన్ చెప్పారు. శుక్రవారం మండలంలోని ఇడుపులపాయలో చేపట్టిన సిఎం ఏర్పాట్లును ఆయన పరిశీలించారు. ఇడుపులపాయలో ముఖ్యమంత్రి పర్యటించే వైఎస్ఆర్ ఘాట్, ఆర్క్ వ్యాలీ పోలీసు స్టేషన్, చర్చి ప్రాంతాలను పరిశీలించి పోలీసు అధికారులకు, సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. సిఎం పర్యటన సందర్భంగా చేపట్టిన బందోబస్తులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అయా ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. సమర్థ వంతంగా బందోబస్తు విధులు చేపట్టాలని కోరారు. ఆయన వెంట జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్నకలెక్టర్ విజయ్‌రామరాజు

ప్రజా చైతన్యంతోనే డెంగీ నివారణ

చింతకొమ్మదిన్నె: ప్రజల్లో చైతన్యం వచ్చినప్పుడే డెంగీ నివారణ సాధ్యమవుతుందిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు, రాష్ట్ర కీటక జనిత వ్యాధుల విభాగం కన్సల్టెంట్ డాక్టర్ కొండారెడ్డి పేర్కొన్నారు, శుక్రవారం చింతకొమ్మదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరికీ కీటక జనిత వ్యాధుల నుంచి రక్షణ కల్పించి ఆరోగ్యం పెంపొందించడం కోసం రూపొందించిన 'ఫ్రైడే డ్రైడే' కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి వెంకటరెడ్డి, కడప మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగలక్ష్మిరెడ్డి, కెఎన్‌వి ప్రసాద్, ఎంవివి ప్రసాద్, సునీత, సూపర్‌వైజర్ జనార్ధన్ బాబు, మోహన్ రెడ్డి, మహి, జయ రత్న, స్థానిక ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **అట్లూరు :** డాక్టర్ విశ్వంత్, మెడికల్ సబ్ యూనిట్ అధికారి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం అట్లూరు పంచాయితీలో డెంగీ నివారణ కోసం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

అవినాష్‌ను వెంటనే అరెస్టు చేయాలి

కడప : ధర్మవరం చేనేత వస్త్ర వ్యాపారులను చిత్రహింసలకు గురి చేసిన విజయవాడ ఆలయ సిల్క్ యజమాని అవినాష్‌ను వెంటనే అరెస్టు చేయాలని తెలుగుదేశం పార్టీ, తొగట వీర క్షత్రియ సాధికార కమిటీ రాష్ట్ర నాయకులు మడక చక్రధర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాటల్లాడారు. ధర్మవరం చేనేత వస్త్ర వ్యాపారులైన శశి, ఆనంద్‌కు తాము సరఫరా చేసిన చేనేత వస్త్రాల సొమ్ము అడిగినందుకు నిర్బంధించి బట్టలు ఊడదీసి, చిత్రహింసల చేసిన విజయవాడ ఆలయ సిల్క్స్ యజమాని అవినాష్‌ను వెంటనే అరెస్టు చేయాలన్నారు. బాధితులు భయపడి కేసు పెట్టకపోయినా మానవ హక్కుల ఉల్లంఘనగా భావించి సుమోటోగా పోలీసులు కేసు నమోదు చేసి ఆలయ సిల్క్స్‌ను సీజ్ చేయాలన్నారు.

మహిళలకు ఆపన్న హస్తం వన్ స్టాప్ సెంటర్

కడప : ఆపదలో ఉన్న మహిళలకు ఆపన్న హస్తం వన్ స్టాప్ సెంటర్ (సఖి) అని, ఒకే చోట అనేక సేవలు లభిస్తాయని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత అన్నారు. శుక్రవారం ఆమె రిమ్స్ ఆవరణంలో గల వన్ స్టాప్ సెంటర్‌ను సందర్శించారు. వన్ స్టాప్ సెంటర్ లో ఉన్న మహిళలతో మాట్లాడారు. రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలు వన్ స్టాప్ సెంటర్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వన్ స్టాప్ సెంటర్లో అత్యవసర స్పందన, చట్టపరమైన సలహాలు, పోలీస్ సహాయం, మానసిక సలహాలు, వీడియో కాన్ఫరెన్స్, తాత్కాలిక ఆశ్రయం లాంటి సేవలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అశ్విని, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బాంధవుడు రాజశేఖర్‌రెడ్డి

కడప అర్బన్ : కీ.శే. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి రైతు బాధవుడని ఎపి అగ్రికల్చర్‌మిషన్ వైస్ చైర్మన్ ఎం.వి.ఎస్.నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్ అండ్ బి అతిథిగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004, మే 2వ వారంలో రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారని పేర్కొన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు రైతుకు వెన్నెముక అన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే రాజశేఖర్‌రెడ్డి జయంతిని రైతు దినోత్సవంగా ప్రకటించారని పేర్కొన్నారు. నాలుగు సంవత్సరాల్లో రైతులకు నేరుగా డిబిటి ద్వారా రూ.92,670.53 కోట్లు జమచేశారని తెలిపారు. సమావేశంలో వ్యవసాయశాఖ సలహాదారులు తిరుపాల్‌రెడ్డి, ఉద్యాన శాఖ సలహాదారులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, భరత్‌రెడ్డి, శ్రీనివాసులు, ప్రసాద్‌రెడ్డి, వ్యవసాయశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని నిరసన

కడప అర్బన్ : కాంట్రాక్టు ఉద్యోగుల తరహాలోనే అవుట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఎపి మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, సుదర్శన్ డిమాండ్ చేశారు. గురువారం జిజిహెచ్ ఓపి బ్లాక్ ఎదుట 5వ రోజు కళ్ళకు గంతలు కట్టుకుని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 2014, జూన్ 2 నాటికి ఐదు సంవత్సరాలు సర్వీస్ పూర్తయిన వారిని అందరిని రెగ్యులర్ చేస్తామని చెప్పిందన్నారు. అదేవిధంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులననూ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ అయ్యేంతవరకు ఆప్కాస్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు భాస్కర్, బాలాజీ రావు, ఏసన్న, రామకృష్ణ, చెన్నయ్య, కార్యదర్శులు కొండయ్య, సురేష్, రాజారత్నం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సూరత్ కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ఆందోళన

కడప : రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ శుక్రవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతం రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఎర్రముక్కపల్లి సర్కిల్ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణు ప్రీతం రెడ్డి మాట్లాడుతూ దేశంలో వ్యవస్థ లన్నింటినీ ప్రధానమంత్రి, హోమ్ మంత్రి ఏ విధంగా నిర్వీర్యం చేస్తున్నారో దీన్నిబట్టి అర్థమవుతుందన్నారు. రాహుల్ గాంధీకి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఒక సెషన్స్ పరువు నష్టం దావా వేయించి సభ్యత్వం రద్దు చేయించారన్నారు.

పాఠశాల గుర్తింపు రద్దు ఉత్తర్వులను కొట్టేసిన హైకోర్టు

ప్రజాశక్తి -ఖాజీపేట

మండల పరిధిలోని కొత్త నెల్లూరు సమీపంలోని బీరం శ్రీధర్ రెడ్డి పాఠశాల గుర్తింపును రద్దు చేస్తూ విద్యాశాఖ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టేసింది. బీరం శ్రీధర్ రెడ్డి పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న సోహిత్ మృతికి యాజమాన్యం కారణమని భావిస్తూ విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల గుర్తింపు రద్దు చేస్తూ ఎటువంటి ముందస్తు నోటీసులు జారీ చేయకుండా ఏ విధంగా రద్దు చేస్తారంటూ పాఠశాల యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. పాఠశాల యాజమాన్యం తరపు న్యాయవాది విజయ్, విద్యాశాఖ అధికారి తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. పాఠశాల గుర్తింపు రద్దు సంబంధించి ఎటువంటి నోటీసులు జారీ చేయకుండా ఏ విధంగా గుర్తింపు రద్దు చేస్తారంటూ విద్యాశాఖ అధికారుల ఉత్తర్వులపై మండిపడుతూ గుర్తింపు రద్దు ఉత్తర్వులను కొట్టేస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది. పాఠశాల యాజమాన్యానికి ఎటువంటి నోటీసు జారీ చేయకుండా గుర్తింపు రద్దు చేయడం చట్ట వ్యతిరేకమని కోర్టు భావించింది.

ఉదయగిరి పరిశీలకునిగా వికాస్ హరికృష్ణ

ప్రజాశక్తి - కడప



ఉదయగిరి నియోజకవర్గం పరిశీలకునిగా టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణను పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా వికాస్ హరికృష్ణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఉదయగిరి నియోజకవర్గం పరిశీలకునిగా నియమించినందుకు టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు అచ్చం నాయుడు లకు ధన్యవాదాలు తెలియజేశారు. ఉదయగిరి నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేసి, 2024 లో టిడిపి అభ్యర్థి గెలుపుకు కృషి చేస్తానని చెప్పారు.

జిల్లా అభివృద్ధికి ప్యాకేజీ ప్రకటించాలి : సిపిఎం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

జిల్లా అభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి రూ.10,000 కోట్లతో ప్యాకేజీని ప్రకటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బి కార్యాలయంలో ఆయన సిపిఎం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ నుంచి రాష్ట్రపతులను, ప్రధాన మంత్రులను, కేంద్ర మంత్రులతో పాటు రాష్ట్రానికి ముఖ్యమంత్రులను కూడా ప్రజలు గెలిపించి పంపారన్నారు. రాయలసీమ అభివృద్ధికి ముఖ్యంగా జిల్లా అభివృద్ధికి ఏమాత్రం పాటుపడలేదన్నారు. కడప జిల్లాకు ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేపట్టాలని విభజన చట్టంలో ఉన్నా దాని గురించి కేంద్రంలో ఊసే లేదన్నారు. జగన్ మోహన్ రెడ్డి రెండుసార్లు ఉక్కు పరిశ్రమ కోసం శంకుస్థాపన చేసినప్పటికీ పురోగతి లేదన్నారు. రూ.7000 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, దశలవారీగా రూ.8800 కోట్లతో ఉక్కు పరిశ్రమ నిర్మిస్తామని చెప్పి ఆరు నెలలు గడుస్తున్నా ఆ దిశగా ఆనవాలే కనపడలేదన్నారు. జిల్లాను వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి మాదిరిగానే ఆయన తనయుడు జగన్మోహన్‌రెడ్డి కూడా అభివృద్ధి చేస్తారని జిల్లా ప్రజలు ముఖ్యమంత్రిని చేస్తే ఆయన మాత్రం జిల్లాకు ఏ విధమైనటువంటి నిధులు కేటాయించడం లేదన్నారు. 9న గండికోట హోటల్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేసేందుకు వస్తున్న ముఖ్యమంత్రి ప్రపంచంలోనే గండికోట ప్రసిద్ధిగాంచిందని చెప్పుకుంటున్నప్పటికీ గడిచిన నాలుగేళ్లలో ఒక్క రూపాయి కూడా ఇంతవరకు గండికోటకు నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. కనీసం గండికోట లోపల పర్యాటకుల కోసం మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదన్నారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించలేదన్నారు. శంకుస్థాపన సమయంలోనైనా గండికోట అభివృద్ధికి హామీ ఇవ్వాలని కోరారు. ఇంతవరకు జిల్లాలో కేవలం ఒక్క పులివెందులకు మాత్రమే రూ.110 కోట్లు ప్రకటించి నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బెల్లం మనోహర్, జమ్మలమడుగు కార్యదర్శి శివ నారాయణ, సిఐటియు నాయకులు దాసరి విజయ్, దాసు, కొండయ్య, వినయ్ పాల్గొన్నారు.



ఆకేపాటి అమర్‌నాథరెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగుల సంఘం నాయకులు

ఉద్యోగ బాధ్యతల్ని సమర్థవంతంగా నిర్వర్తించండి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉద్యోగులు తమ బాధ్యతల్ని సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ముగ్గురికి కారుణ్య నియామక పత్రాలను, ఏడుగురికి ప్రమోషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ జయంతి సందర్భంగా జిల్లా పరిషత్ అనుబంధ విభాగాల్లో ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తూ దురదృష్టవశాత్తూ మృతి చెందిన వారి కుటుంబాల్లో సంతోషం నింపే ప్రయత్నం చేస్తున్నామన్నారు. మరణించిన వారి పిల్లలకు కారుణ్య నియామకాల కింద అనిల్‌కుమార్ యాదవ్, నాగేంద్రకుమార్‌నాయక్, పి.సుజాతలకు ఉద్యోగాలు ఇస్తున్నామని తెలిపారు. ఇదేతరహాలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్.రామ్‌ప్రతాప్, బి.గురప్ప, వి.చంద్రకళ, ఎస్.కరీముల్లా, ఒ.శారదమ్మ, పి.శంకర్, బి.రఘునాథరెడ్డిలకు ఉద్యోగోన్నతులు కల్పిస్తూ పత్రాలను అందజేస్తున్నామని చెప్పారు. జిల్లా పరిషత్ ఉద్యోగుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నామని చెప్పారు. అనంతరం పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో లంకా మల్లేశ్వరరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నాగిరెడ్డి, చంద్ర, పలువురు ఉద్యోగులు గజమాలతో జిల్లా పరిషత్ చైర్మన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒ వెంకటరమణారెడ్డి, ఎఒ రంగాచార్యులు, పలువురు ఉద్యోగులు, జడ్‌పిటిసిలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఉమ్మడి పౌరస్మృతికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ

కడప : కేంద్రంలోని మతోన్మాద భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం భారత రాజ్యాంగానికి విరుద్ధంగా ఉమ్మడి పౌరస్మృతి అమలు చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా శుక్రవారం కడప నగరంలోని నబికోట, రవీంద్రనగర్లలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు .ఈ సందర్భంగా భారీ సంఖ్యలో ప్రజలు సంతకాలు చేసి ఉమ్మడి పౌరస్మృతికి వ్యతిరేకంగా నిరసనను తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీలు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కడప అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' ద్వారా పేద, బడుగు, బాలహీన వర్గాల ప్రజల ఇంటివద్దకే వెళ్లి సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేసి అభివృద్ధి, సంక్షేమ ఫలాల అందిస్తున్నారని ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా అన్నారు. శుక్రవారం కడప నగరంలోని 45, 32వ డివిజన్లలోని సచివాలయాల్లో ఉపముఖ్యమంత్రి ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి 'జగనన్న సురక్ష' శిబిరాలను నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అప్జల్‌ఖాన్, మార్కెట్ యార్డు చైర్మన్ బంగారు నాగయ్య, వైస్ ఛైర్మన్ ఇబ్రహీం మియా, స్థానిక కార్పొరేటర్లు అంకమ్మ, జఫ్రుల్లా, ఇతర కార్పొరేటర్లు షేక్ మహమ్మద్ షఫీ, నాయకులు నరపురెడ్డి సుబ్బారెడ్డి, తోటకృష్ణ, సచివాలయ వాలంటీర్లు పాల్గొన్నారు.

మృతదేహానికి అంత్యక్రియలు

పోరుమామిళ్ల : పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న గుర్తు తెలియని వ్యక్తికి అంత్యక్రియలు చేసి మానవత్వం చాటుకున్నారు. కాశినాయన మండలంలోని వరికుంట్ల ఎస్టీ కాలనీ సమీపంలో వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ హరి ప్రసాద్ పంచనామా కోసం పోరుమామిళ్ళ తరిలించారు. శుక్రవారం పోస్టుమార్టం పూర్తి చేసిన అనంతరం అతనికి సంబంధించిన వారు ఎవరూ ముందుకు రాకపోవడంతో పోలీసులు వివేకానంద ఫౌండేషన్ సంస్థకు మృతదేహాన్నిఅప్పగించారు. రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, కొండా ఫణీంద్రా రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ ఖాదరయ్య సహకారంతో సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి, సుంకె వెంకటేశ్వర్లు, ముత్తుముల రామ తులసి అంత్యక్రియలు చేసి మానవత్వం చాటుకున్నారు.

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

కడప : రాయలసీమ గ్రామీణ బ్యాంక్ ఉద్యోగుల పరపతి సంఘం పాలకవర్గ సభ్యుల ఎన్నికలకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎన్నికల అధికారి ఆర్. మహాదేవ రెడ్డి తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ఈనెల 13 ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. 14న నామినేషన్ల పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణ గడువు 15 సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. పోటీ ఉంటే ఎన్నికలు ఈనెల 23న 7 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు పోలింగ్ ఉంటుందని తెలిపారు. ఆఫీస్ బేరర్ల ఎన్నిక ఈనెల 26న ఉంటుందన్నారు. నామినేషన్ల ప్రక్రియ కడప పట్టణంలోని నాగరాజు పేటలోని జిల్లా సహకార వ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని వినతి


కడప అర్బన్ : ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న మున్సిపల్ వర్కర్స్‌ను రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సిఐటియు నగర అధ్యక్షులు పి. చంద్రారెడ్డి, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) జిల్లా నాయకులు కె.తిరుపాల్, నగర అధ్యక్షులు సుంకర రవి డిమాండ్ చేశారు. శుక్రవారం డిప్యూటీ సిఎం కార్యాలయంలో అంజాద్‌బాషాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 40 వేల మంది మున్సిపల్ కార్మికులు 123 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, నగర పంచాయతీలలో పని చేస్తున్నారని తెలిపారు. వీరికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించడం లేదని చెప్పారు. గతంలో అనేక తీర్పుల్లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు టైంస్కేల్ అమలు చెయ్యాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా నేటికి అమలు చేయడం లేదని పేర్కొన్నారు. సిఎం అధికారంలోకి వచ్చి 4 ఏళ్ళ గడుస్తున్నా ఎలాంటి హామీనీ నెరవేర్చలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం నిమిత్తం ఈనెల 9 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార జాతాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో భవిష్యత్ పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అవమానించడమే : డివైఎఫ్ఐ

కడప అర్బన్ : ఉద్యోగాలలో క్రీడాకోటాను రద్దు అంటే క్రీడాకారులను అవమానించడమేనని, మెడలిస్టులకు ప్రోత్సాహకాలు, ఆర్థిక సాయమే 2023-28 క్రీడా పాలసీలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం.ఓబులేసు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డిఆర్ఓ గంగాధర్ గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగాల భర్తీలో ఇప్పటివరకు అమలు చేస్తున్న క్రీడల కోటాను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయనున్నట్లు చెప్పడం సరికాదని తెలిపారు. జాతీయ,అంతర్జాతీయ పోటీల్లో మెడల్స్ సాధించిన వారికి రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు కల్పించడం ఆనవాయితీగా వస్తుందని చెప్పారు. ఇప్పటివరకు మెడల్స్ సాధించిన వారికి అనేక రాష్ట్రాల్లో గౌరవ సూచికంగా ఉద్యోగాలు ఇస్తున్నాయని చెప్పారు. తక్షణమే ఉద్యోగాలలో క్రీడల కోట రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు విజయ్ పాల్గొన్నారు.

ఈవెంట్స్ ప్రకటించిన తర్వాతే సిఎం జిల్లాకు రావాలి

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న తిరుమలేష్

క్వాలిఫై అయిన ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్య ర్థులకు ఫిజికల్ ఈవెంట్స్ మెయిన్స్ పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారో తేదీలు ప్రకటించిన తరువాత సిఎం జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనకు రవాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జా తిరుమలేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి నాలుగు సంవత్సరాలు అవుతున్న జాబ్ క్యాలెండర్ లేక, నూతన పరిశ్రమలు రాక నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ప్రిలిమ్స్ పరీక్షలు నిర్వహించి ఆరు నెలలు గడుస్తున్నా ఫిజికల్ ఈవెంట్స్, మెయిన్స్ పరీక్షల్లో కాలయాపన చేయడం దారుణం అన్నారు. ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగుల విరమణ వయసు 62కు పెంచి రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉద్యోగాలు మరింత దూరం చేశారన్నారు. సమావేశంలో డిసిసి ప్రధాన కార్యదర్శి ప్రసాద్, హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు శివ, అడ్వకేట్ భువన ఏకాదశి రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు వంశీ, మోహిద్దిన్, సూర్యుడు పాల్గొన్నారు.

యునాని మెడికల్ కళాశాల ఎక్కడో స్పష్టత ఇవ్వాలి

కడప : యునాని మెడికల్ కాలేజీ, రీసెర్చ్ సెంటర్ అప్పుడు కడపలో అన్నారు. ఇప్పుడు రాయచోటిలో అంటున్నారు ఇందులో ఏది నిజమో ముఖ్యమంత్రి స్పష్టత ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు ఎస్ఎనజీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నజీర్ అహ్మద్ మాట్లాడారు. 2016లో అప్పటి ప్రభుత్వం యునాని మెడికల్ కాలేజీ, రీసెర్చ్ సెంటర్ కోసం 25 ఎకరాల స్థలాన్ని రిమ్స్ వద్ద కేటాయించారన్నారు. ఆ తర్వాత ప్రభుత్వంలో పనులు ముందుకు సాగలేదు అన్నారు. మూడున్నర సంవత్సరాలైనా రిపోర్టు రాలేదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి యునాని కాలేజీ విషయంలో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు జోడు నాగరాజు, మల్లెం విజయభాస్కర్, అలీఖాన్, ఆరిఫుల్లా, ఆసిఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్సీ

ఒంటిమిట్ట : మండలంలోని చిన్న కొత్తపల్లిలో తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు సోదరుడు బాబు కొద్ది రోజుల కిందట మృతిచెందారు. శుక్రవారం ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మామిడి శ్రీనివాసులు ఇంటికి వెళ్లి అతన్నీ పరామర్శించారు అనంతరం దర్జేపల్లిలోని సుబ్బారెడ్డి కొన్ని రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబాన్ని పరామర్శించి అన్ని విధాల ఆదుకుంటామని భరోసా అని ఇచ్చారు



ఉరేగింపు నిర్వహిస్తున్న దర్గా పీఠాధిపతి, ముస్లిములు

దస్తగిరి స్వామి దర్గా ప్రారంభం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఆదర్శ గ్రామ పంచాయతీ ఎస్.ఉప్పలపాడులో అతి పురాతనమైన దస్తగిరి స్వామి దర్గాను గ్రామస్తుల సహకారంతో శోభాయమానంగా పునర్నిర్మించారు. గురువారం రాత్రి ఎం.బి. శ్రీనివాసుల రెడ్డి అధ్యక్షతన కన్నుల పండుగగా దస్తగిరి స్వామి దర్గా ప్రారంభోత్సవం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జమ్మలమడుగు జామియా మసీదు పీఠాధిపతి సయ్యద్ షా సాదిక్ పాషా ఖాద్రి ప్రసంగించారు. అనంతరం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తమ గ్రామంలోని పురాతనమైన దస్తగిరి స్వామి దర్గా గతంలో కురిసిన వర్షాలకు, ఈదురు గాలులకు దెబ్బతిని శిథిలావస్థకు చేరుకోవడంతో తమ గ్రామంలోని వారందరం కలిసి దర్గాను కుల మతాల భేదాలకు అతీతంగా నిర్మించుకున్నారు. ఉప్పలపాడులో దస్తగిరి స్వామి దర్గా ఫకీర్ల దర్గా వద్ద గొప్ప మేళా నిర్వహించారు. ఆయా రకాల విన్యాసాలు చేస్తూ దస్తగిరి స్వామి పెద్ద జెండాలతో పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి పాల్గొని దస్తగిరి స్వామి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ఉత్సవంలో గ్రామ నాయకులు శ్రీనివాసరెడ్డి కుటుంబీకులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, వేలాది సంఖ్యలో ప్రజలు, భక్తులు మహిళలు చిన్నారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయ వంతం చేశారు. అనంతరం గ్రామంలోని చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 4,000 మందికి పైగా భక్తులకు దర్గా కమిటీ నిర్వాహకులు గ్రామనాయకులు అన్నదానం చేశారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

చాపాడు : మైదుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం వైసిపి సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి రాచమల్లు రవిశంకర్ రెడ్డి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా శుక్రవారం 500 ప్లేట్లు, పాఠశాలకు అవసరమైన ఫర్నిచర్ వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ రాజశేఖరుడి పాలనకు మించి జగనన్న పాఠశాలలను అభివృద్ధి చేశారని కొనియాడారు. ఆరోగ్యశ్రీ, 108, ఫీజు రీయింబర్స్‌మెంట్ నేటికీ ప్రజలకు ఫలాలను ఇస్తున్నాయన్నారు. అనంతరం విద్యార్థులకు ప్లేట్లు, పాఠశాలకు ఫర్నిచర్ పంపిణీ చేశారు. బాలికల పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని సిబ్బంది కొరగా తప్పక చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఉపాధ్యాయులు రాచమల్లు రవిశంకర్ రెడ్డిని శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం

ముద్దనూరు : ఎంఆర్‌పిఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక కొత్తకొట్టాల వీధిలో సీనియర్ నాయకులు గంగులయ్య ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ లక్ష్యసాధన కోసం జులైలో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాజన సోషలిస్టు పార్టీని చట్ట సభల్లో అడుగుపెట్టే దిశగా ప్రజల్లో చైతన్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో నరసింహ, అరవింద్, అనిల్, బద్రి, నాగార్జున, రమేష్, హరి, రామకృష్ణ, మునెంద్ర పాల్గొన్నారు.

భూములు మాకు స్వాధీనం చేయండి

పులివెందుల రూరల్: 1988లో తమకు సంక్రమించిన భూములను అప్పగించాలని గిరిజనులు పేర్కొంటున్నారు. పులివెందుల పట్టణంలోని నగరగుట్టలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ డి పట్టాల ద్వారా తొండూరు మండలం యాదవ గుంట గ్రామంలో సుమారు సుమారు 53 మందికి పైగా భూములు ప్రభుత్వం పంపిణీ చేసిందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఆ భూములను చదును చేసుకుని వ్యవసాయం చేసుకోవాలంటే యాదవగుంట గ్రామస్తులు అడ్డుపడుతున్నారని వాపుతున్నారు. గిరిజనులు గ్రామంలోకి అడుగుపెట్టనివ్వకుండా చేస్తున్నారని పేర్కొంటున్నారు. పలు మార్లు తహ శీల్దార్‌కు చెప్పినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా దర్బార్‌లో ఎంపీ అవినాష్ రెడ్డికి చెప్పామని ఆయన తహశీల్దార్‌కు ఫోన్ ద్వారా సందేశాన్ని ఇచ్చి భూములను తమకు అప్పగించాలని చెప్పినప్పటికీ అధికా రులు స్పందించడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పం దించకుంటే ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తాం అంటున్నారు.

క్రైం కార్నర్





రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకులు

స్కూటర్‌ను ఢీకొన్న టిప్పర్ : ఇద్దరు దుర్మరణం

దువ్వూరు: మండలం చింతకుంట సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. వివరాలలోకి వెళితే...ద్విచక్ర వాహనంలో వెళుతున్న యువకులను చింతకుంట సమీపంలోని మలుపు వద్ద వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బొట్ల పోలిరాజు, నాగబ్రహ్మం అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతుల్లో ఒకరిది బ్రహ్మంగారిమఠం, మరొకరిది మైదుకూరు మండలంగా గుర్తించారు.

ఆర్‌టిసి అద్దె బస్సు ఢీకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలు

ఖాజీపేట : స్థానిక బస్టాండ్ కూడలిలో ప్రొద్దుటూరు డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు వేగంగా వచ్చి ఓ వృద్ధురాలిని ఢీ కొట్టడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన మహిళ పత్తూరుకు చెందిందని, అప్పుడప్పుడూ ఆమె మతిస్థిమితం కోల్పోతూ ఉంటుందని స్థానికులు చెప్పారుఉ. ు. బస్టాం డులో ఓవైపు ఉండగా ఆర్టీసీ అద్దె బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టడ తో ప్రమాదం చోటుచేసుకుంది. బస్టాండులోని కొందరు వ్యక్తులు ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ పై చేయి చేసుకున్నారు. గాయపడిన వృద్ధ మహిళను చికిత్స నిమిత్తం కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కాగా స్థానిక బస్టాండ్ కూడలిలో ప్రమాదానికి గురైన వృద్ధ మహిళను ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు 108 వాహనానికి ఫోన్ చేయగా ఎంతకూ స్పందించలేదు. ప్రమాదం జరిగిన గంట సేపటి వరకు వాహనం ప్రమాద ఘటనకు చేరుకోలేదు.

రెండు బైకులు ఢీ : ముగ్గురికి గాయాలు

దువ్వూరు : జాతీయ రహదారిపై రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ముగ్గరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మండలంలోని వెంకులపల్లికి చెందిన కటిక పల్లె దస్తగిరి బైక్‌పై దువ్వూరుకు బయలు దేరాడు. అదే సమయంలో నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన మరో ఇద్దరు బైకుపై వెళ్తూ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్నారు. ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగా యాలయ్యాయి. వారిలో దస్తగిరి ఆర్యోగం విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం 108 ద్వారా ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కమలాపురం: స్థానిక మార్కెట్ యార్డ్ పరిధిలో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి చంద్ర అనే యువకుడు మృతి చెందాడు. మార్కెట్ యార్డ్ ఆవరణలో ట్యాంక్ నిర్మాణ పనుల్లో ఈ సంఘటన చోటు చేసుకుంది. యువ కుడిని తనతోటి కూలీలు ఆస్పత్రికి తీసుకెళ్లగా డాక్టర్ పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపాడు. నెలరోజుల నుండి ఇక్కడ జరుగుతున్న పనిలో అక్రమంగా విద్యుత్ వాడుతున్నా పటించుకోని అధికారులు ప్రమాదం జరగగానే అక్రమంగా విద్యుత్ వాడుతున్న తీగలు తొలగించారు.

అంతా సంసిద్ధం

రేపు సిఎం జగన్ చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు



మున్సిపల్ భవనం



నగరవనం పార్కు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లా లో పర్యటనలో భాగంగా పట్టణ పరిధిలో సుమారు రూ.126.32 కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను ఆదివారం ప్రారంభించనున్నారు. ఇందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

నైపుణ్య శిక్షణ భవనం

పట్టణ పరిధిలోని నగిరిగుట్ట రింగ్ రోడ్డు సమీపంలో రూ.32.82 కోట్లతో నిర్మిం చారు. దీనివల్ల నియోజకవర్గంలో యువతీ, యువ కులకు ఉపాధి కోసం నాణ్యమైన శిక్షణ అంద నుంది.



నైపుణ్య శిక్షణ భవనం

మున్సిపల్ కార్యాలయం నూతన భవనం

ప్రస్తుతం ఉన్న మున్సిపల్ కార్యాలయం పక్కన రూ.25 కోట్ల తో ఆధునీకరణ కార్యాలయాన్ని నిర్మించారు. ఇకనుంచి ఆధునీకరణ భవ నంలో కార్యకలాపాలు నిర్వహించనున్నారు.

నగరవనం, బోటింగ్

ఇందిరమ్మ రాణి తోపు సమీపంలో రూ.39 కోట్లతో నగరవనం, బోటింగ్ పనులు పూర్తి చేశారు. ప్రారంభం తర్వా త పిల్లలకు ఆహ్లాదకరమైన ఆటలకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

హాకీ, క్రికెట్ స్టేడియం

భాకరాపురం రింగ్ రోడ్డు సమీపంలో రూ.9 కోట్లతో హాకీ స్టేడియం, రూ.18 కోట్లతో వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియాన్ని, అలాగే రూ. 2.5 కోట్లతో క్రీడా భవనాలను నిర్మించారు.. ప్రారంభం తర్వాత ఇక్కడ క్రీడాకారులకు హాకీ, క్రికెట్ నేర్చుకోవడానికి ఎంతగానో ఉపయోగపడతాయి. హాకీ, క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడానికి అనువుగా స్టేడియాన్ని రూపొందించారు.

న్యూ బయో సైన్స్

పట్టణ పరిధిలోని పశువు పరిశోధనా సంస్థ ఆవర ణలో రూ.25 కోట్లతో న్యూ బయో సంస్థ ద్వారా నిర్మించే పరిశోధన విభా గానికి శంకుస్థాపన చేయనున్నారు. గొర్రెలకు పోషక పదార్థాలను అందించడానికి న్యూ బయోటెక్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదు ర్చుకున్నారు. ప్రభుత్వ భూమిని బయోటెక్‌కు కేటాయించారు. ఇందుకోసం రూ.25 కోట్లతో న్యూ బయోటెక్ సంస్థ ఇక్కడ ఉత్పత్తులు ప్రారంభించడానికి ముందుకు వచ్చింది.

కాంట్రాక్టు ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి- జమ్మలమడుగు

రాష్ట్రంలో ఉన్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేస్తానని ఎన్నికల ముందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చి విస్మరించడం సమంజసం కాదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ తెలిపారు. శుక్రవారం జమ్మలమడుగు పట్టణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగులకు తెలంగాణ కంటే అధికంగా వేతనాలు ఇస్తానని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీ ప్రకటించి నాలుగు సంవత్సరాలు పూర్తయినప్పటికీ ఒక్క రూపాయి పెంచిన పాపాన పోలేదని వాపోయారు. 2017 సంవత్సరంలో విఆర్ఎల ధర్నాకు వచ్చిన అప్పటి ప్రతిపక్ష నేత జగన్ తాము అధికారంలోకి రాగానే విఆర్ఎలకు రూ. 15 వేల వేతనం ఇస్తానని ప్రకటించి ఇప్పటివరకు అతిగతి లేదని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ స్కీం ప్రవేశపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. జమ్మలమడుగు ప్రాంతంలో త్వరతగతిన ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు విజయ్ కుమార్, దాసరి విజయ్, భాగ్యమ్మ, ఏసుదాసు, ఆదాము పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

జగనన్నతోనే గ్రామ స్వరాజ్యం



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే సుధీకర్‌రెడ్డి

ప్రజాశక్తి- జమ్మలమడుగు

గ్రామ స్వరాజ్య స్థాపన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం జమ్మలమడుగు పట్టణంలోని 7,8 వార్డు సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఏదైతే ప్రజలకు హామీలు ఇచ్చారెఎ అంతకుమించి ప్రజలకు అనేకమైన సంక్షేమ పథకాలతో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ చేసి లబ్ధి చేకూరుస్తున్నారు. 7,8 వ వార్డులో ఇంటి స్థలాలు మంజూరు కాలేదని, కరెంట్ సరఫరా సరిగా రావడం లేదని, విద్యుత్ నియంత్రిక పని చేయక చాలా రోజులు ఆయిందని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వేల్పుల శివమ్మ, మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి, పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వరరెడ్డి,కౌన్సిలర్లు పొట్టిపాటి విజయ,శ్రీరాములు చిన్న నాగన్న, సచివాలయ కన్వీనర్ కొండల ఉమాదేవి, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు వైసిపి నాయకులు పాల్గొన్నారు. **చాపాడు :** జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి టి లక్షుమయ్య తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని అల్లాడుపల్లెలో జగనన్న సురక్ష గ్రామసభను నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సురేష్‌రెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒరాధాకృష్ణ వేణి, డిటి భవానీ, సచివాలయాల కన్వీనర్లు, మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, సర్పంచ్ కిషోర్ కుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి చంద్ర శేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **వేంపల్లె :** జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు తహశీల్దార్ చంద్ర శేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కత్తులూరు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఒ సోమ శేఖర్ రెడ్డి, సర్పంచ్ పావని, ఎంపిటిసి కల్యాణి, మాజీ సర్పంచ్ ప్రసాద్ రెడ్డి, సోమేశ్వరరెడ్డి, మారం శ్రీకాంత్ రెడ్డి, సచివాలయం కన్వీనర్ శివప్రసాద్ రెడ్డి, వాలింటీర్లు, ప్రజలు, అధికారులు పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** ప్రజలకు ఆదాయ, కుల, జనన, మరణ, వివాహ తదితర 11 రకాల సర్టిఫికెట్లు జగనన్న సురక్ష ద్వారా ప్రభుత్వం అందిస్తోందని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మిస్సమ్మ బంగ్లా సచివాలయం ఆవరణంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనే, ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందని చెప్పారు. మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి మనోహర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో కమిషనర్ నరసింహారెడ్డి, వైస్ చైర్మన్ హాఫీజ్ వార్డు సచివాలయం పరిధిలోని కౌన్సిలర్‌లు ఖాదర్‌బాష, గాజుల సలీమ, పుష్పవతి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలమకూరు సచివాలయం -1 పరిధిలో ఎంపిడిఒ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష క్యాంపును నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పాల్గొని పలు రకాల సర్టిఫికెట్ల కోసం దాఖలు చేసుకున్న లబ్ధిదారులకు పత్రాలను అందించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి తమ్మిశెట్టి బాలయ్య ,గ్రామ సర్పంచ్, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలోకి చేరికలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పట్టణంలోని వైసిపిలో కొనసాగుతున్న ప్రముఖులు టిడిపిలోకి భారీగా చేరుతున్నట్లు తెలుస్తుంది. ప్రొద్దుటూరు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ జి.వి.ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరడానికి150 వాహనాల్లో మంగళగిరికి బయలుదేరారు. సిఎం సొంత ఇలాకాలో వైసిపి షాక్ తగిలింది. మైనార్టీ నాయకులు నేడు చంద్రబాబుతో భేటీ కానున్నారు. వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరు మాజీ వైస్ చైర్మన్ జబీబుల్లా, ఇండిపెండెంట్ కౌన్సిలర్ మహమ్మద్ గౌస్ చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరనున్నారు. ప్రొద్దుటూరు నుంచి దాదాపు 150 కాన్వాయలతో బయలుదేరిన వీరు టిడిపిలో చేరి ప్రొద్దుటూరు టిడిపికి వెన్నెముకగా మారనున్నారు. ప్రొద్దుటూరు మైనార్టీల చేరికతో టిడిపి మరో బలం పుంజుకోనుంది. మాజీ ఎమ్మెల్యే వరదరాజు రెడ్డి, ప్రొద్దుటూరు ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి ,రాష్ట్ర నాయకుడు సురేష్ నాయుడులతో ప్రొద్దుటూరు టిడిపి జోష్ అందుకోనుంది. ఇక మిగిలింది టికెట్ ప్రకటించడమే అన్న చందాగా ప్రొద్దుటూరు టిడిపి రాజకీయాలు ఉన్నాయి. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో మైనార్టీలది పెద్దపీట గనుక మైనార్టీల చేరిక టిడిపికి కంచుకోటగా మారనుంది. అమరావతి వెళ్లిన వారిలో మాజీ మున్సిపల్ చైర్మన్ పాణ్యం సావిత్రమ్మ, ఆర్యవైశ్య నాయకుడు రవీంద్ర, మాజీ కౌన్సిలర్లు, మైనారిటి నాయకులు, బీసీ నాయకులు, ఆర్య వైశ్యలు తరలివెళ్లారు. ముస్లిం నేతల చేరికతో పొద్దుటూరు వైసిపి రాజకీయానికి గడ్డు పరిస్థితి ఎదురయ్యే అవకాశం ఉందని విశ్లేషకుల అభిప్రాయం.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

లీలావతి ఆశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

పట్టణంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు శుక్రవారం పురపాలక ఇన్‌ఛార్జి పురపాలక వైస్ చైర్మన్ వై.ఎస్. మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తన స్వగృహానికి వెళ్లి ఆయనకు పలువురు కార్యకర్తలు బొకేలను ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భారీ కేకును ఆయన కట్ చేశారు. ఎపి పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ గంగాధర్ రెడ్డి కూడా ఈరోజు జన్మదినం కావడంతో ఆయనతో కూడా కేకును కట్ చేయించారు. పురపాలక కో ఆప్షన్ దాసరి చంద్రమౌళి ఆధ్వర్యంలో వీరి ఇరువురి జన్మదినం సందర్భంగా లీలావతి వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో పురపాలక చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, గంగాధర్‌రెడ్డి, కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లి కిషోర్, డేనియల్, బ్రాహ్మణపల్లి మహేశ్వర్ రెడ్డి ,రాజేష్ ఉన్నారు.

మహాజన సోషలిస్టు పార్టీని గెలిపించుకుందాం

జమ్మలమడుగు రూరల్ : మహాజన సోషలిస్టు పార్టీని తెలుగు రాష్ట్రాలలో గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పిచ్చికె బాబు మాదిగ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ 29వ,ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణ మాదిగ 58వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొదట వేపరాల, పెద్ద పసుపుల గ్రామాల్లో, తర్వాత పాత బస్టాండ్ నందు దండోరా జెండాలు ఎగరవేశారు. అంబేద్కర్ విగ్రహం నుంచి జగ్జీవన్ రామ్ విగ్రహం వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కన్వీనర్ వెలగచర్ల శివయ్య, ఆర్‌టిపిపి రాష్ట్ర అధ్యక్షులు కె. సాల్మన్, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు చిన్నయ్య, జిల్లా కన్వీనర్ మానికింద వెంకటేష్, కో కన్వీనర్ శ్రీనివాసులు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు విజయ రాణి, నరసింహులు, గంగరాజు, పాల్గొన్నారు.



గండికోట జలాశయాన్ని పరిశీలిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

గండికోటను సందర్శించిన ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- జమ్మలమడుగు

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఈనెల 9న గండికోటకు రానున్న నేపథ్యంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి శుక్రవారం ఉదయం వారు అధికారులతో కలిసి పర్యటించారు. గండికోటలోని హెలిప్యాడ్, శిలాఫలకం ఆవిష్కరించే ప్రాంతాన్ని వ్యూ పాయింట్ స్థలాన్ని వారు పరిశీలించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజకవర్గంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ప్రత్యేక శ్రద్ధ ఉందన్నారు. గండికోట ప్రాంతానికి ఒబెరాయ్ హోటల్స్ రావడానికి ముఖ్య కారణం ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈ ప్రాంతంపై శ్రద్ధ వహించడమే అన్నారు. ఒబెరాయ్ హోటల్స్ రావడం వల్ల ఈ ప్రాంతం ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతుందన్నారు. గండికోట పర్యాటక ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, పోలీసు, రెవెన్యూ అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కుదేలైన రవాణా రంగం : పిసిసి

వేంపల్లె : రాష్ట్రంలోని రవాణా రంగమంతా వైసిపి పాలనలో కుదేలైందని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాహనాల త్రైమాసిక పన్ను పొరుగు రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్ లో ఇప్పటికే 30 శాతం ఎక్కువగా ఉందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పొరుగు రాష్ట్రాల కంటే లీటర్ కు రూ.5 నుండి రూ.12 వరకు ఎక్కువగా ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం గ్రీన్ టాక్స్‌ను రూ.200 నుంచి రూ.20 వేల వరకు పెంచారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు కూడా అధ్వానంగా ఉండడంతో వాహనాలు చాల దెబ్బ తిం టున్నాయి అన్నారు. దీనికి తోడు వాహనాలకు చెందిన టైర్లు, స్పేర్ పార్ట్స్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి అన్నారు. ఇన్సూరెన్స్ ప్రీమియం కూడా పెరిగిందని వాపోయారు. గోరు చుట్ట పై రోకటి పోటులా త్రైమాసిక పన్నును మళ్ళీ 25 శాతం పెంచుతూ 2023 మే 22న జీవోః 31 జారీ చేయడం శోచనీయం అన్నారు. త్రైమాసిక పన్నును పెంచడం వల్ల 10 టైర్ల లారీకి రూ. 6600 ఉండగా ప్రస్తుతం రూ 8410 అయ్యిందని తెలిపారు. దీని వల్ల ఏడాదికి రూ 250 కోట్లు అదనపు భారం పడిందని అన్నారు. జీవో 31ని వెం టనే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు.

సిబిఐటిలో రక్తదాన శిబిరం

చాపాడు : స్థానిక సిబిఐటి కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ సహకారంతో రాయచోటి దీప వాలంటరీ బ్లడ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మేనేజర్ శివ శంకర్ రెడ్డి పర్యవేక్షణలో శుక్రవారం రక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిబిఐటి అధ్యాపకులు, విద్యార్థులు దాదాపు 115 మంది ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ రక్తాన్ని దానం చేశారని కళాశాల చైర్మన్ డాక్టర్ వి. జయ చంద్ర రెడ్డి తెలిపారు. ఇటువంటి రక్త దాన శిబిరాలను తమ కళాశాలలో తరచూ నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల్లోని సేవా దృక్పథాన్ని కొనియాడారు. కార్యక్రమంలో సిబిఐటి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. శ్రీనివాసుల రెడ్డి , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఐసిడిఎస్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

10న అంగన్వాడీ సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అంగన్వాడీ సమస్యలపై కలెక్టర్ కార్యాలయం ఎదుట ఈనెల 10న ధర్నా నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో కార్యాలయ అధికారి వందనకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 36 గంటలు ధర్నా అంగన్వాడీ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తామని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రూ. 26 వేల వేతనాలు ఇవ్వాలని, సెంటర్ అద్దెలు పెంచాలని డిమాండ్ చేశారు. కూరగాయలు విపరీతంగా పెరిగాయని, అందుకు అనుగుణంగా బిల్లులు ఇవ్వాలన్నారు.పై సమస్యలపై కడప కలెక్టర్ ఆఫీస్ వద్ద ఈ నెల 10, 11 తేదీల్లో 36 గంటలు ధర్నా కొనసాగిస్తున్నామన్నారు.ఈ ధర్నాకు అంగన్వాడీ టీచర్లందరూ పెద్ద ఎత్తున తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బాలసుబ్బయ్య, అంగన్వాడీ యూనియన్ పట్టణ అధ్యక్షులు రాణి, రాజి, సుశీల, రామసుబ్బమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలుర పాఠశాల హెచ్‌ఎంగా శివమునెమ్మ

వేంపల్లె : స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా శివ మునెమ్మ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఉపాధ్యాయల బదిలీలో హెచ్‌ఎంగా భారతిని నియమించగా ఆమె ఉద్యోగోన్నతిపై ఎంఇఒగా తొండూరు మండలానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో పులివెందులలో పని చేస్తున్న శివ మునెమ్మను ఇక్కడికి బదిలీ చేశారు. శుక్రవారం ఆమె పాఠశాలకు రావడంతో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఉపాధ్యాయుల సహ కారంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన చేస్తామన్నారు. అందరి సహకారంతోనే పాఠశాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. అనంతరం ఉపాధ్యాయులకు సంబంధించిన హాజరు పట్టికను పరిశీలించారు. తరగతి గదులు కూడా పరిశీలించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని సూచి ంచారు. . ప్రతి విద్యార్థి సిఎం కలను నిజం చేసేందుకు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధర్మారెడ్డి, భాస్కర్ రెడ్డి, సతీష్, బోధనేతర సిబ్బంది శ్రీనివాసులు, ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్ తో పాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిసిసి బ్యాంకు ఏర్పాటుకు చర్యలు

దువ్వూరు : బంగ్లా ఆవరణలో ఉన్న పాత తహశీల్దార్ కార్యాలయంలో డిసిసి బ్యాంకు ఏర్పాటుకు సిద్ధం చేస్తున్నట్లు డిసిసి చైర్మన్ మల్లెల ఝాన్సీ రాణి, రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వారు భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు మేలు చేసేందుకే ఈ ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. బ్యాంకు ప్రజలకు దగ్గరలో ఉండాలనే ఉద్దేశంతో పాత తాసిల్దార్ కార్యాలయాన్ని ఎన్నుకున్నామని వారు తెలిపారు కార్యక్రమంలో లీగల్ అడ్వయిజర్ సహాదేవ రెడ్డి, బ్రాంచి మేనేజర్లు రవీంద్రారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు

ఇటుకల బట్టీ ప్రారంభం

జమ్మలమడుగు రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు రాయల్ కిరణ్ కు చెందిన నూతన ఇటుకల బట్టీని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుబాటులో ఉండేలా ధరలు ఉండాలన్నారు. నాణ్యతగా తయారు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పైపులైన్ పనులు పరిశీలన

ఎర్రగుంట్ల : నగర పంచాయతీకి పోట్లదుర్తి నుంచి సరఫరా అవుతున్న మంచినీటి పైపులైను మరమ్మతు పనులను మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ శుక్రవారం పరిశీలించారు. పైప్ లైన్ మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి పట్టణానికి తాగునీటి సమస్యను నివారించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ 24 గంటలలో మరమ్మతు పనులను పూర్తి చేసి తాగునీటి సరఫరా పునరుద్ధరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అలీ,అసిస్టెంట్ ఇంజినీర్ సురేష్, ఆర్ఒ గంగిరెడ్డి పాల్గొన్నారు.